క్లుప్తంగా

సాక్షి కార్యాలయంపై దాడి అమానుషం


రేగాన శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: ఏలూరు జిల్లా కేంద్రంలోని సాక్షి కార్యాలయంపై టీడీపీ నాయకుల దాడి అమానుషమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పత్రికా స్వేచ్ఛను టీడీపీ నేతలు హరించడం బాధాకరమన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేసే మీడియా సంస్థలపై, వ్యక్తులపై దాడులకు దిగడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. దాడికి బాధ్యులైన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాధ్యతల స్వీకరణ


దుర్గాప్రసాద్

పూసపాటిరేగ: భోగాపురం సీఐగా కోన దుర్గాప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విశాఖ సిటీ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంత వరకు ఇక్కడ పనిచేసిన ఎస్వీ ప్రభాకరరావుకు విశాఖకు బదిలీ జరిగింది.

జాగ్రత్తలు తప్పనిసరి


సతివాడలో వేతనదారులకు సూచనలు ఇస్తున్న వైద్యాధికారి సుమలత

నెల్లిమర్ల రూరల్: ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధిహామీ వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా పలు జాగ్రత్తలు పాటించాలని హోమియో వైద్యాధికారిణి సుమలత సూచించారు. మండలంలోని సతివాడలో పనులు చేస్తున్న వేతనదారులను గురువారం కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హోమియోమందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..ఎండలో పని చేయడం వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఎండలో తిరగొద్దని సూచించారు. ఎక్కువగా శీతల పానీయాలు తీసుకోవాలని, ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


27న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం


వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కర్రి వెంకటరమణ సిద్ధాంతి, తదితరులు

విజయనగరం టౌన్: నగరంలోని పూల్‌బాగ్ లక్ష్మీగణపతి కాలనీలో కొలువుదీరిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం ఈ నెల 27న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త, స్వామి ఉపాసకుడు కర్రి వెంకటరమణ సిద్ధాంతి అన్నారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో వార్షికోత్సవానికి సంబంధించి కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. 60 అడుగుల స్వామివారి విగ్రహానికి ఆ రోజు ఉదయం నుంచి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపడతామని చెప్పారు. భక్తులందరూ స్వామివారిని దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరమణ, బేతా కృష్ణారావు, ఇసరపు వెంకట శ్రీనివాసరావు, బెహరా కూర్మారావు, దన్నాన రామూర్తి, అర్చకులు శ్రీనివాసశర్మ , సముద్రాల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి తోడ్పాటు..

- జేసీ సేతుమాధవన్


సతివాడ పీఏసీఎస్ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

నెల్లిమర్ల రూరల్: రైతులకు ప్రయోజనకరమైన సేవలు అందించి, వారి అభివృద్ధికి పీఏసీఎస్‌లు తోడ్పాటును అందించాలని జేసీ ఎస్. సేతుమాధవన్ సూచించారు. మండలంలోని సతివాడ పీఏసీఎస్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సొసైటీ ఆర్థిక లావాదేవీలపై ఆరా తీశారు. ప్రభుత్వ లక్ష్యాలను పీఏసీఎస్‌లు సకాలంలో చేరుకోవాలన్నారు. రైతుల ఆర్థిక అభివృద్ధికి సహకరించడమే కాకుండా సొసైటీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ ఉమామహేశ్వరరావు, డీజీఎం ప్రసాద్, బీఎం రజిని, పర్సన్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు, సీఈఓ సన్యాసప్పడు, తదితరులు పాల్గొన్నారు.

రంగు చూసి మోసపోకుమా..!

- మామిడిని మగ్గబెట్టేందుకు రసాయనాల వినియోగం
- ఆకర్షణీయంగా కనిపిస్తుండడంతో మోసపోతున్న వినియోగదారులు
- రసాయనాల వినియోగంపై పట్టించుకోని అధికారులు


మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న మామిడి పండ్లు

విజయనగరం: కొద్ది రోజులుగా మార్కెట్‌లో మామిడి పండ్లు దర్శనమిస్తున్నాయి. ఫలరాజుగా పేరొందిన మామిడి కొందరు వ్యాపారుల అత్యాశ కారణంగా విషతుల్యంగా మారుతున్నాయి. ప్రస్తుతం కాయలను కృత్రిమంగా మగ్గబెడుతున్నారు. నిషేధిత కాల్షియం కార్బైడ్, ఇతర ప్రమాదకర రసాయనాలను వ్యాపారులు వినియోగిస్తున్నారు. వీటి వినియోగం వల్ల ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

తప్పని ముప్పు..

రసాయనాలతో పక్వానికి తెచ్చిన పండ్లను తింటే ఆరోగ్య సమస్యల బారినపడే ప్రమాదముంది. దీర్ఘకాలికంగా ఇలాంటి పండ్లను తీసుకోవడం ద్వారా క్యాన్సర్, అల్సర్, కాలేయం (లివర్), మూత్రపిండం (కిడ్నీ), జీర్ణ సంబంధిత వ్యాధులతో పాటు కాళ్లు, చేతులు తిమ్మిర్లు, నరాల బలహీనతకు గురయ్యే అవకాశం ఉంది. కాల్షియం కార్బైడ్ ద్వారా వెలువడే ఎసిటిలిన్ వాయువు నాడీ వ్యవస్థ మీద ప్రభావం చూపడంతో తలనొప్పి, దీర్ఘకాలిక మత్తు, శక్తిని కోల్పోయే ప్రమాదముంది. చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గి శ్వాస సంబంధిత ఇబ్బందులు తలెత్తుతాయి. గర్భిణుల్లో హార్మోన్లు దారి తప్పుతాయి.

రంగును చూసి గుర్తించొచ్చు..

రంగును చూసి పండ్లను చాలా వరకు గుర్తించే అవకాశముంది. కార్బైడ్, ఇతర రసాయనాలు ఉపయోగించిన మామిడి పండ్లు బయటికి లేత పసుపు, లోపల లేత తెలుపు రంగులో ఉంటాయి. సహజంగా పండిన పండు బయట, లోపల ఒకే వర్ణంలో ఉంటుంది. రసాయనాలు విడుదల చేసే ఎసిటిలిన్ వాయువుతో పండ్లు బయటి వైపు రంగు మారుతుందే తప్ప అంత రుచిగా ఉండవు.

ఇదీ పరిస్థితి..

- మామిడి కాయలను ఎథ్రిల్ లిక్విడ్‌లో 5 నిమిషాల పాటు ముంచి మూడు, నాలుగు రోజులు నిల్వ చేస్తే సహజత్వానికి దగ్గరగా పండుతాయి. ముంచడం సాధ్యం కానిపక్షంలో లిక్విడ్‌ను కాయలకు స్ప్రే చేస్తారు.
- కాయలు 24 గంటల్లోనే మేలిమి పండులా కనిపించేందుకు పరిమితికి మించి కార్బైమడ్ వినియోగిస్తుండటంతో.. ఆరోగ్యానికి ముప్పు తప్పడం లేదు. ప్రభుత్వం ఆమోదించిన ఇథిలిన్‌తో పోలిస్తే కార్బైడ్, ఇతర రసాయనాలు మార్కెట్లో చౌకగా లభిస్తుండడంతో యథేచ్ఛగా వాడుతున్నారు.
- 2011 ఆహార భద్రత, ప్రమాణాల నిబంధనల ప్రకారం ప్రభుత్వం కార్బైడ్, ఎసిటిలిన్ రసాయనాలను నిషేధించింది.
- సహజంగా పండించే ఇథిలిన్‌ను మాత్రమే 100 పీపీఎం వరకు వినియోగించేందుకు అనుమతిచ్చింది.
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం సుమారు 20 కిలోల పండ్లకు 5 గ్రాముల ఇథిలిన్‌ను వినియోగించాల్సి ఉంటుంది.

జైలు శిక్ష, జరిమానా తప్పదు..

ఆహార సురక్ష ప్రమాణాల చట్టం–2006 ప్రకారం కాల్షియం కార్బైడ్‌తో మామిడి పండ్లను మగ్గించకూడదు. కార్బైడ్ వాడిన పండ్లను తినడం వల్ల ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. నిబంధనలకు విరుద్ధంగా కార్బైడ్‌తో మగ్గబెట్టి విక్రయించే వారికి ఏడాది జైలు శిక్ష, జరిమానా తప్పదు.

– ఈశ్వరి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ అధికారి, విజయనగరం

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



విజయనగరం అర్బన్: క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న మాజీ సైనికులు, చిన్నారులు


విజయనగరం టౌన్: గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల ప్రతినిధులు

విజయనగరం టౌన్: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులను హత్య చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన యాత్రికులకు నివాళులర్పిస్తూ గురువారం స్థానిక కలెక్టరేట్ గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ.దుర్గారావు మాట్లాడుతూ..ఉగ్రవాదాన్ని తుదముట్టించాలన్నారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రేగేటి సంతోష్, గరుగుబిల్లి వినయ్‌బాబు, ప్రజాహక్కుల సాధన సమితి చోడి ఆదినారాయణ, దళిత చైతన్య సేవా సంఘం ప్రతినిధి సోము మురళి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల ర్యాలీ..

విజయనగరం అర్బన్: ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ జిల్లాకు చెందిన పలువురు మాజీ సైనికులు పట్టణ వీధుల్లో నిరసన ర్యాలీ చేపట్టారు. నేతాజీ మాజీ సైనికుల అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ మరియు వ్యాకింగ్ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ జంక్షన్ నుంచి సైనిక సంక్షేమ కార్యాలయం వరకు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పాకిస్తాన్ ప్రోత్సాహంతో జరిగిన ఇటువంటి దుశ్చర్యలను నిలువరించాలన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దింటి గుణాకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చలమూరు రామారావు, ఉపాధ్యక్షుడు పొట్నూరు మన్మధ, ప్రధాన కార్యదర్శి ఎంఎల్ నారాయణరావు, జాయింట్ సెక్రెటరీ గొర్ల శివకుమార్, షబాస్, సతీష్, దంతంశెట్టి శ్రీనివాస్, ఏసుదాసు, రామ్మృష్ణ, శ్రీనివాసరెడ్డి, సామిరెడ్డి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దెంకాడ: విద్యుత్ లైన్ల విభజన పనుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 4 వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మోపాడ, జగన్నాథపురం, వల్లూరు గ్రామాలకు పూర్తిగా.. మోదవలసలో కొంత భాగానికి సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సతివాడ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ పి. త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడంతో పాటు సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మధుపాడ, పినతరిమి, పెద తరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, బొడ్డపేట, ఒమ్మి, మల్యాడ, వెంకన్నపాలెం గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజావసరాలు తీర్చడమే ధ్యేయం

- ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి


వాటర్ పైప్‌లైన్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అదితి, తదితరులు

విజయనగరం: ప్రజావసరాలు తీర్చడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్థానిక శాసన సభ్యురాలు పూసపాటి అదితి విజయ లక్ష్మి గజపతిరాజు అన్నారు. వీటీ అగ్రహారం బీసీ కాలనీ వద్ద వాటర్ ట్యాంక్ పైపులైన్, ఇంటర్ కనెక్షన్లను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..వీటీ అగ్రహారం కాలనీ ప్రజల అవసరాలను ఒక్కొక్కటిగా గుర్తించి పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. తూర్పు కాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ పాలవలస యశస్వి మాట్లాడుతూ.. ప్రజల దాహార్తిని తీర్చే బృహత్తర కార్యక్రమాలను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ కె.అప్పలరాజు, స్థానిక కార్పొరేటర్ కడియాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర

- ఎస్పీ వకుల్ జిందల్


కేక్ కట్ చేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్ ,చిత్రంలో ఏఎస్పీలు సౌమ్యలత, నాగేశ్వరరావు, గోపాలనాయుడు

విజయనగరం క్రైమ్: విద్యార్థుల అభివృద్ధి వెనుక ఉపాధ్యాయుల కృషి ఉంటుందని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఆర్మ్‌డ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శర్వాణి ఆంగ్ల పాఠశాల పదో తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించింది. 13 మంది విద్యార్థులకు గాను అందరూ పాసవ్వడంతో గురువారం స్థానిక డీపీఓ కాన్ఫరెన్స్ హాల్‌లో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ కేక్ కట్‌చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు తీసుకువస్తే తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్య, ఇన్‌చార్జ్ ఏఆర్ ఎస్సై గోపాలనాయుడు మాట్లాడుతూ.. 13 మంది విద్యార్థుల్లో 11 మందికి 500 మార్కులకు పైగా వచ్చాయన్నారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన వైష్ణవి (575), హర్షవర్ధన్ (562), రవీంద్రలను ఎస్పీ అభినందించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, ఆర్ఎస్సైలు రమేష్‌కుమార్, శ్రీనివాసరావు, సంధ్య, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం కావాలి

- లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ


వేతనదారులతో మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ


నెల్లిమర్ల: గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ సుధారాణి

విజయనగరం గంటస్తంభం: దేశంలో, రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం అయితేనే గ్రామీణాభివృద్ధి జరుగుతుందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఉపాధి హామీ వేతనదారులను కలిసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధి జరగాలంటే మహాత్మా గాంధీ కన్న కలలు నిజం చేయాలని కోరారు. భారతదేశంలో 2,69,191 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, వాటి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థిరమైన నిర్ణయాలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. అనంతరం ఉపాధి పనుల నిర్వహణపై ఆరా తీశారు.

గ్రామాల అభివృద్ధితోనే..

నెల్లిమర్ల: గ్రామాలు అభివృద్ధి సాధించిన రోజే దేశాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ అంబళ్ల సుధారాణి అన్నారు. నెల్లిమర్ల మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పంచాయతీలను బలోపేతం చేయడానికే పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రజలకు స్వశక్తిని కలిగించడం, గ్రామ సమస్యలను స్థానికంగానే పరిష్కరించడానికి ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహామండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములు నాయుడు, ఈఓపీఆర్‌డీ శంకర్ జగన్నాథ్, ఎంఈఓలు సూర్యనారాయణమూర్తి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పిచ్చుకల తోరణం..



విద్యుత్ తీగలపై పిచ్చుకలు ఒక క్రమ పద్ధతిలో నిల్చొని కనువిందు చేశాయి. దాదాపు అంతరించిపోతున్న పిచ్చుకలు మండలంలోని గుణుపూరుపేట విద్యుత్ తీగలపై సందడి చేయడం గురువారం సాక్షి కంట పడింది. కాసేపు ఎగరడం..మళ్లీ వచ్చి తీగలపై వరుసులో నిలబడడంతో సమీపంలో ఉన్న వారు ఈ దృశ్యాలను సెల్‌ఫోన్లలో బంధించారు.

– దెంకాడ

అభినందనలు..



నెల్లిమర్ల ఎంపీడీఓ కె. రామకృష్ణరాజు ఉత్తమ అధికారిగా ఎంపిక య్యారు. దీంతో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా రామకృష్ణరాజును గురువారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో అభినందించారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారు. రామకృష్ణరాజును ఎంపీపీ అంబళ్ల సుధారాణి, అధికారులు అభినందించారు.

– నెల్లిమర్ల

ముహూర్తపు రాట..



నెల్లిమర్ల మండలంలోని సారిపల్లి గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఉత్సవాలు గురువారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యాగశాల వద్ద ముహూర్తపు రాట కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టి శాస్త్రోక్తంగా ముహూర్తపు రాటను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

– నెల్లిమర్ల రూరల్

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం..


అగ్నిప్రమాద బాధితులకు సహాయం అందజేస్తున్న లక్ష్మణరావు, తదితరులు

పూసపాటిరేగ: ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు అండగా ఉంటామని మాజీ మంత్రి బొత్స సోదరుడు బొత్స లక్ష్మణరావు అన్నారు. మండలంలోని బరిణికాంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు రూ.1.20 లక్షల నగదు, బియ్యం, నిత్యావసర సరుకులను బొత్స లక్ష్మణరావు, బొత్స చైతన్య అందజేశారు. పెండ్లి నిమిత్తం ఉంచిన నగదు కాలిపోవడంతో ఆ కుటుంబానికి రూ. 75 వేలు, మిగతా నాలుగు బాధిత కుటుంబాలకు రూ.10 వేలు చొప్పున, దివ్యాంగుడు గులివిందల సత్యనారాయణకు 5 వేల రూపాయల చొప్పున నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొత్స లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నప్పుడు మనోధైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడిరామ్, పతివాడ సూరిబాబు, కల్యాణపు భాస్కరరావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్కుల పరిరక్షణ అందరి బాధ్యత


పార్కు పరిసరాలను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్, తదితరులు

- అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు

విజయనగరం: పార్కుల పరిరక్షణ అందరి బాధ్యతని విజయనగరం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ కె. అప్పలరాజు అన్నారు. గురువారం స్థానిక 28వ డివిజన్ పీఎస్ఆర్ కాలనీ పార్క్ నుంచి ప్రారంభమైన వార్డు పర్యటనలో ఆయన పాల్గొన్నారు. కార్పొరేటర్ జాకీర్ హుస్సేన్ పలు సమస్యలను వినతిరూపంలో ఆయనకు అందజేశారు. అనంతరం డివిజన్‌లో పర్యటించి పలు సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

28వ డివిజన్ పర్యటనలో ముఖ్యంగా పార్కుల నిర్వహణ విషయమై ఇబ్బందులను గమనించామన్నారు. వాటిని పరిష్కరించేందుకు తగు సూచనలు చేస్తామన్నారు. అలాగే అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ సీతారామమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.